# ధర్మశాస్త్రపు ప్రజ - ఇశ్రాయేలు మతం

యూదు మతం లేక ఇశ్రాయేలు మతం కేవలం ఆచారవ్యవహారాలతో కూడిన ఒక మతం కాదు. అబ్రాహాం తన స్వదేశాన్ని విడిచి అతని భార్య శారాతో కనాను దేశం వెళ్లాలని దేవుడు సెలవిచ్చినప్పుడు ఈ మతం ప్రారంభమైంది. ఈ ఆజ్ఞతోబాటు, దేవుడు అబ్రాహాంకు మూడు విషయాలు గురించి ఒక వాగ్దానం చేశాడు.

అబ్రాహాం సంతానం గొప్ప ప్రజ అవుతారు.

వారు ఒక స్వంత దేశంలో నివసిస్తారు

అబ్రాహాం సంతానం భూమిమీద వున్న అన్ని జాతుల ప్రజలకు ఆశీర్వాద కారణం అవుతారు (ఆది 12:1-3; 15:1-6; 17:1-8).

ఈ వాగ్దానాలకు ప్రతిఫలంగా అబ్రాహాం అతని సంతానం దేవుణ్ణి నమ్మి ఆయనకు మాత్రమే లోబడాలి. దేవునికి అబ్రాహాంకు మధ్య వున్న నిబంధనకు గుర్తుగా అబ్రాహాం అతని సంతానం సున్నతి నాచరించాలి (ఆది 17:9-27). సున్నతి దేవుని ప్రజలకు ప్రత్యేక గుర్తు.

ఈ క్రింది అంశాలు ఇశ్రాయేలు మతాన్ని ప్రాచీన ప్రపంచంలో విశిష్టంగా నిలబెట్టాయి.

తాము దేవుడు (యెహోవా) ఎన్నుకొన్న ప్రత్యేక ప్రజ అనే విశ్వాసం

ఇశ్రాయేలీయులకు దేవునికి మధ్య వున్న ప్రత్యేకమైన సంబంధం; దేవుడు వారికి తోడుగా వుండి సహాయం చేస్తాడనే నమ్మకం.

వారు కేవలం యెహోవాను మాత్రమే విశ్వసించడం; యితర దేవుళ్లను దేవతలను పూజించకుండడం.